18-04-2022 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - నిశ్చయం చేసుకోండి, మన వద్ద ఏదైతే ఉందో అదంతా తండ్రిది, మళ్ళీ ట్రస్టీగా అయి సంభాళించినట్లయితే, అంతా పవిత్రమైపోతుంది, మీ పాలన శివబాబా భండారం నుండి జరుగుతుంది"

ప్రశ్న:- శివబాబాపై పూర్తిగా బలిహారమైన తర్వాత ఏ సావధానాన్ని పెట్టుకోవడం చాలా అవసరము?

జవాబు:- మీరు బలిహారమైన తర్వాత, అంతా శివబాబాకు చెందినదిగా అయ్యింది, మరి అడుగడుగునా సలహా తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఏదైనా చెడు కర్మ చేసినట్లయితే చాలా పాపం కలుగుతుంది. ఏ ధనమైతే శివబాబాకు చెందినదిగా అయిందో, దానితో ఎటువంటి పాప కర్మ చేయలేరు ఎందుకంటే ఒక్కొక్క పైసా వజ్ర తుల్యమైనది, అందుకే చాలా సంభాళించాలి. ఏదీ వ్యర్థంగా పోకూడదు. బాబా మీది ఏమీ తీసుకోరు కానీ ఏ ధనమైతే మీ వద్ద ఉందో, దానిని మనుష్యులను గవ్వ నుండి వజ్ర తుల్యంగా చేసే సేవలో పెట్టాలి.

గీతము:- ఈ రోజు మానవుడు అంధకారంలో ఉన్నాడు... (ఆజ్ అంధేరే మే హై ఇన్సాన్...)

ఓంశాంతి. ఇది భక్తి చేసేవారి కోసం పాట. మీరైతే ఈ పాటను పాడలేరు ఎందుకంటే భగవంతుడా, వచ్చి పరిచయాన్ని ఇవ్వండి అని అంటారు కూడా. ప్రభువే వచ్చి తమ పరిచయాన్ని ఇస్తారు. ప్రభువు, ఈశ్వర, భగవంతుడు విషయం ఒక్కటే అయిపోతుంది. ప్రభువుకు బదులుగా, మీరు, ఓ బాబా, అని అంటారు, కనుక పూర్తిగా సహజమైపోతుంది. "బాబా" అనే పదం పరివారానికి సంబంధించినది. మొత్తం రచనంతా తండ్రిదే ఉంది, కనుక అందరూ పిల్లలు అయిపోయారు. తండ్రి అని అనడం చాలా సహజము. కేవలం ప్రభువు లేక గాడ్ అని అనడంతో తండ్రి అని అర్థం చేసుకోరు. ఈ తండ్రి ప్రేమ మరియు తండ్రి ఆస్తి గురించి కూడా తెలియదు. తండ్రి అయితే స్వర్గాన్ని రచిస్తారు. ఇంత చిన్న విషయాన్ని కూడా ఎవ్వరూ అర్థం చేసుకోరు. అర్ధకల్పము దెబ్బలు తినడంలో ఉండిపోయారు. బాబా వచ్చి చిటికెలో (సెకెండులో) పరిచయాన్ని ఇస్తారు. బాబా ఎదురుగా పిల్లలు కూర్చున్నారు కూడా, అయినా నడుస్తూ-నడుస్తూ నిశ్చయం తెగిపోతుంది. ఒకవేళ పక్కా నిశ్చయం ఉన్నట్లయితే సత్యాతి-సత్యమైన బ్రాహ్మణులుగా అయిపోవాలి. మనం ఉన్నదే శివబాబాకు మనవలము, బాబా ఇంటికి చెందినవారిగా అయిపోయాము. మేము బ్రాహ్మణులము, శివబాబా భండారా నుండి తింటున్నామని భావిస్తారు. బ్రాహ్మణులుగా అయిపోయాము అంటే బ్రాహ్మణులదే బ్రహ్మ భోజనం అవుతుంది. శివబాబా భండారా యొక్క భోజనం అవుతుంది, ఈ నిశ్చయం ఉండాలి. మనం శివబాబాకు చెందినవారమే. వదిలి వెళ్ళే విషయమే లేదు. బ్రాహ్మణులమైన మనం శివబాబాకు పిల్లలము. మనదంతా బాబాకు చెందినది మరియు తండ్రిదంతా మనది. వ్యాపారస్థులు లెక్కలు తీయాలి. మనదంతా తండ్రిది మరియు తండ్రిదంతా మనది, కనుక త్రాసు ఎవరిది భారీగా ఉంది? మన వద్దనైతే పనికిరానిది ఉంది మరియు మనం అంటాము, బాబా యొక్క రాజ్యం మనది. కనుక తేడా ఉంది కదా. మీకు తెలుసు, మనం ఈశ్వరుని ద్వారా విశ్వానికి యజమానులుగా అవుతాము. మన వద్ద ఏదైతే ఉందో దానిని తండ్రికి ఇచ్చేస్తాము. తండ్రి మళ్ళీ అంటారు, పిల్లలూ, మీరే ట్రస్టీగా అయి సంభాళించండి. ఇది శివబాబాది అని భావించండి. స్వయాన్ని కూడా శివబాబా సంతానంగా భావిస్తూ నడుచుకోండి, అప్పుడు అంతా పవిత్రంగా అయిపోతుంది. ఇంట్లో కూడా బ్రహ్మ భోజనమే అవుతుంది. అది శివబాబా భండారాగా అయిపోతుంది ఎందుకంటే బ్రాహ్మణులే తయారుచేస్తారు. వాస్తవానికి, అంతా ఈశ్వరుడు ఇచ్చినటువంటిది అని అందరూ అంటారు, కానీ ఇక్కడైతే తండ్రి సమ్ముఖంలో వచ్చారు. ఇప్పుడు మనం వారిపై బలిహారమవుతాము. మనం ఒక్కసారి బలిహారమైతే అది శివబాబా భండారాగా అయిపోతుంది. దానిని బ్రహ్మ భోజనమని అనడం జరుగుతుంది. మనం ఏదైతే తింటామో, అది శివుని భండారాకు చెందినది అని భావించడం జరుగుతుంది. పవిత్రంగా అయితే తప్పకుండా ఉండాలి. భోజనం కూడా పవిత్రంగా అవుతుంది, కానీ ఎప్పుడైతే బలిహారమవుతారో అప్పుడే అలా అవుతుంది కదా. ఇవ్వవలసింది కూడా ఏమీ లేదు, కేవలం బలిహారమవ్వాలి. బాబా ఇదంతా మీదే. అచ్ఛా, పిల్లలూ, ట్రస్టీగా అయి సంభాళించండి. శివబాబాది అని భావిస్తూ తింటే శివబాబా భండారా నుండి తిన్నట్లు అవుతుంది. ఒకవేళ శివబాబాను మర్చిపోతే, అది పవిత్రంగా అవ్వజాలదు. పిల్లలైన మీరు తమ ఇళ్ళు-వాకిళ్ళను కూడా సంభాళించుకోవాలి. కానీ స్వయాన్ని ట్రస్టీగా భావిస్తూ ఇంట్లో కూర్చుని కూడా శివబాబా యొక్క భండారాదే తింటారు. ఎవరైతే బలిహారమయ్యారో, వారు శివబాబాకు చెందినవారిగా అయ్యారు. ఏదైనా అర్థం కాకపోతే అడగండి. శివబాబా ఖజానా నుండి ఖర్చు చేసి, ఏదైనా పాపం చేయడము, ఇలా కాదు. శివబాబా యొక్క ధనంతో పుణ్యం చేయాలి.

ఒక్కొక్క పైసా వజ్ర తుల్యమైనది. దాని ద్వారా చాలామంది కళ్యాణం జరగనున్నది, అందుకే చాలా సంభాళించుకోవాలి. ఏదీ కూడా వ్యర్థంగా పోకూడదు ఎందుకంటే ఈ ధనంతో మనుష్యులు గవ్వ నుండి వజ్ర తుల్యంగా అవుతారు. బాబా అంటారు, మాది కూడా మీదే. ఒక్క తండ్రి మాత్రమే నిష్కామి. పిల్లలందరి సేవ చేస్తారు. తండ్రి అంటారు, నేనేం చేసుకుంటాను, అంతా మీదే. మీరే రాజ్యం చేస్తారు. మా పాత్రే ఈ విధంగా ఉంది, పిల్లలైన మిమ్మల్ని సుఖమయంగా చేస్తాను. శ్రీమతం కూడా లభిస్తూ ఉంటుంది. ఎవరైనా కన్య వివాహం చేసుకోవాలనుకుంటే జ్ఞానంలోకి రాకపోతే వెళ్ళనివ్వండి అని అంటారు. కొడుకు ఒకవేళ ఆజ్ఞాకారిగా లేకపోతే వారసత్వానికి హక్కుదారుడు కాడు. శ్రీమతంపై నడుచుకోకపోతే శ్రేష్ఠమైనవారు కాదు, హక్కుదారులు కాదు. తర్వాత శిక్షలు కూడా అనుభవించవలసి ఉంటుంది. తండ్రి ఆజ్ఞ ఉంది, అంధులకు చేతి కర్రగా అవ్వండి. వారైతే ఏమీ అర్థం చేసుకోరు.

మీకు తెలుసు, మనం కూడా మొదట పూర్తిగా కోతి వలె పతితంగా ఉండేవారము. బాబా ఇప్పుడు మన సైన్యాన్ని తీసుకున్నారు. మనకు శిక్షణ ఇచ్చి మందిర యోగ్యులుగా తయారుచేస్తున్నారు, విశ్వానికి యజమానులుగా తయారుచేస్తారు. మిగిలిన వారందరికీ శిక్షలు ఇచ్చి ముక్తిధామంలోకి పంపిస్తారు. అనంతమైన తండ్రి యొక్క విషయాలన్నీ అనంతమైనవి. ఒక్క సీతా-రాముల విషయం కాదు. తండ్రి కూర్చుని అన్ని శాస్త్రాల సారాన్ని అర్థం చేయిస్తారు. మనుష్యులు చదవడమైతే చాలా చదువుతారు కానీ ఏమీ అర్థం చేసుకోరు. కనుక వారు చదివినా, చదవలేనట్లే అవుతుంది. చదువుతూ-చదువుతూ ఇంకా కళలు తగ్గిపోతూ పతితులుగా, భ్రష్టాచారులుగా అయిపోయారు. పతిత-పావనా రండి, అని అంటారు. మళ్ళీ గంగలో నిలబడి, దానం చేయండి అని అంటారు. అరే, మనమైతే పావనంగా అవ్వాలి, ఇందులో దానం యొక్క విషయం ఏముంది. గంగ యొక్క నీటిలో దానం చేస్తారు. పెద్ద-పెద్ద రాజులు బంగారు నాణాలను విసురుతారు, మళ్ళీ పూజారులు జీవనాధారం కోసం ఏదో ఒకటి వినిపిస్తారు. మీకైతే 21 జన్మలకు జీవనాధారాన్ని తండ్రి తయారుచేస్తారు. తండ్రి ఎంత మంచి రీతిగా అర్థం చేయించి పావనంగా చేస్తారు. భారత్ యే పావనంగా ఉండేది, ఇప్పుడు పతితంగా అయ్యింది. బాబా కూర్చుని పిల్లలైన మీకు పరిచయాన్ని ఇస్తారు, మీరు బ్రాహ్మణులుగా ఎవరైతే ఉన్నారో, సరెండర్ అయ్యి ఉన్నారో, మీరు శివబాబా భండారా నుండి తింటారు. సరెండర్ అవ్వకపోతే ఆసురీ భండారా నుండి తింటారు. బాబా ఈ విధంగా ఏమైనా చెప్తారా, మీ బాధ్యతలు మొదలైనవాటిని ఇక్కడకు తీసుకురండి అని. మీరే సంభాళించుకోండి, కానీ ట్రస్టీగా అయి. నిశ్చయబుద్ధిగా ఉన్నట్లయితే మీరు శివబాబా భండారా నుండి తిన్నట్లే. మీ హృదయం శుద్ధంగా అవుతూ ఉంటుంది. బ్రాహ్మణ దేవీ-దేవతాయ నమః అని పాడుతారు కూడా, ఈ బ్రాహ్మణులే నమస్కరించబడేందుకు యోగ్యులు. బ్రహ్మ ద్వారా బాబా మనల్ని శూద్రుల నుండి బ్రాహ్మణులుగా చేస్తారని మీకు తెలుసు. కల్ప-కల్పము బాబా వచ్చి మనల్ని రావణ రాజ్యం నుండి విడిపించి సుఖమయంగా తయారుచేస్తారు. అక్కడ దుఃఖం యొక్క పేరు కూడా ఉండదు. భారత్ లో ఎంతగా లెక్కలేనంత మంది గురువులు, విద్వాంసులు, పండితులు ఉన్నారు. ప్రతి ఒక్క స్త్రీకి పతి కూడా గురువే. ఎంతమంది గురువులయ్యారు. ఎన్ని తప్పుడు కార్య-వ్యవహారాలు నడిపిస్తూ వచ్చారు. పతియే మీకు సర్వస్వం, వీరి ఆజ్ఞలోనే ఉండాలి అని ఎగ్రిమెంట్ (ఒప్పందం) చేయిస్తారు. మొదటి ఆజ్ఞ చేస్తారు- పూజ్యంగా ఉండే కుమారి వెంటనే పూజారిగా అయిపోతుంది. అందరి ఎదురుగా తల వంచి నమస్కరించవలసి వస్తుంది. తర్వాత రెండవ ఆజ్ఞ చేస్తారు- కామ ఖడ్గాన్ని నడిపించండి. కనుక ఎంత తేడా ఉంటుంది. ఇక్కడైతే తండ్రి అంటారు, నాకు సహాయకులైన పిల్లలు కావాలి. వారు కాళ్ళపై ఎందుకు పడాలి. పిల్లలు వారసులు. నమ్రతను చూపించడానికి కాళ్ళపై పడవలసిన అవసరం లేదు. నమస్తే అని చెప్పవచ్చు. మీరంటారు, మేము బాబా నుండి వారసత్వం తీసుకోవడానికి వచ్చాము. మళ్ళీ మాయ పూర్తిగా మరపింపజేస్తుంది. విడిచి వెళ్ళిపోతారు. బుద్ధిని మాయ సమాప్తం చేస్తుంది. ఈ రోజు బాబా అర్థం చేయించారు, ఎవరైతే శివుని భండారా నుండి తిన్నారో, తాగారో వారి భండారం నిండుగా అవుతుంది కనుక కాల కంటకాలు (కష్టాలు,దుఃఖాలు) అన్నీ దూరమైపోతాయి, అమరులుగా అయిపోతారు. మీరు బలిహారమైతే మొత్తం అంతా శివబాబాకు చెందినదిగా అవుతుంది, పక్కా నిశ్చయం కావాలి. ఏదైనా చెడు కర్మ చేస్తే చాలా పాపం కలుగుతుంది. అడుగడుగునా సలహా తీసుకోవాలి, ఇది పెద్ద ఆరోహణ. ఎంతమంది పడిపోతారు. బాబా-బాబా అంటూ 8-10 సంవత్సరాలు ఉన్నా కూడా మాయ చెంపదెబ్బ వేస్తుంది. బాబా అంటారు, అడుగడుగునా ఎక్కడైనా సరే తికమకపడితే సలహా అడగండి. చాలామంది పిల్లలు, మేము మిలిటరీలో సర్వీస్ చేస్తాము, అక్కడి భోజనం తినవలసి వస్తుందని అడుగుతారు. బాబా అంటారు, చేయగలిగేది ఏముంది. తండ్రి నుండి మతం తీసుకున్నారు అంటే బాధ్యుడు బాబా. చాలామంది అడుగుతారు, బాబా, విదేశాలకు వెళ్ళాలి, పార్టీలో కూర్చోవలసి ఉంటుంది. శాకాహారమైతే లభిస్తుంది, కానీ అది వికారీదే కదా. మీరు సాకులు ఏమైనా చెప్పవచ్చు. అచ్చా, టీ తాగుతాము. అనేక రకాల యుక్తులు లభిస్తూ ఉంటాయి. వీరి కుడి భుజమైన ధర్మరాజు కూడా కూర్చున్నారు. ఈ సమయంలో అడుగడుగునా శ్రీమతం తీసుకోవాలి.

ఇది చాలా ఉన్నతమైన పదవి. మేము విశ్వానికి యజమానులుగా అవ్వగలము అని ఎవ్వరికీ స్వప్నంలో కూడా గుర్తుండదు. ఏ మాత్రమూ తెలియదు. ఎన్ని వజ్ర-వైఢూర్యాల మహళ్ళు ఉండేవి. సోమనాథ్ మందిరంలో ఎంత సంపద ఉండేది, అంతా ఒంటెలపై నింపుకొని తీసుకువెళ్ళారు. ఇప్పుడు ఎటువంటి సమయం రానున్నది అంటే, కొందరి ధనం మట్టిలో కలిసిపోతుంది.... రామ నామం సత్యమైనది అని అంటారు కదా. సత్యమైన సంపాదన చేసుకున్నవారి చేతులు నిండుగా ఉంటాయి. మిగిలినవారంతా ఖాళీ చేతులతో వెళ్తారు. తండ్రి అంటారు, మీ వస్తువైతే మీ కోసమే. మేమైతే నిష్కామి. ఇటువంటి నిష్కాములు ఎవ్వరూ లేరు. ఈ సమయంలో అందరూ తమోప్రధానంగా, పతితంగా అవ్వాల్సిందే. పూర్తి పతితంగా అయి మళ్ళీ పూర్తి పావనంగా అవ్వాలి. తండ్రి అంటారు, నాకు సంకల్పం ఉత్పన్నమయ్యింది, కొత్త ప్రపంచాన్ని రచించాలి అని. నేను నా పాత్రను అభినయించడానికి వచ్చాను. గొప్ప-గొప్ప ముఖ్యమైనవారు ఎవరైతే ఉన్నారో, వారందరూ ఈ విధంగా సమయమనుసారంగా పాత్రను అభినయిస్తారు. ఇప్పుడు మీకు తెలుసు, నాలెడ్జ్ ఫుల్ అయిన తండ్రి పిల్లలైన మిమ్మల్ని కూడా నాలెడ్జ్ ఫుల్ గా తయారుచేస్తున్నారు. ఇంతకుముందు ఈ జ్ఞానం ఏమైనా ఉండేదా. ఇప్పుడు మీకు అందరి జీవితచరిత్ర తెలుసు. ధర్మ స్థాపకులు కూడా ముఖ్యమైనవారు కదా. పై నుండి చూస్తే ఉన్నతాతి ఉన్నతమైనవారు రచయిత అయిన శివబాబా. తర్వాత బ్రహ్మా-విష్ణు-శంకరులు. తర్వాత బ్రహ్మా ద్వారా బ్రాహ్మణులను రచిస్తారు. ఇంకెవ్వరికైనా ఏం తెలుస్తుంది, ఈ జగదంబ సరస్వతి బ్రాహ్మణి అని. ఇంతకుముందు కూడా ఇదే సమయంలో మీరు తపస్య చేసారు. రాజయోగాన్ని నేర్పించారు. ఇప్పుడు కూడా అదే కార్యాన్ని చేస్తున్నారు. ఈ జ్ఞానంలో రమణం చేయాలి. ఉండడమైతే తమ ఇంట్లోనే ఉండాలి. అందరూ ఇక్కడైతే కూర్చుండిపోలేరు. అయితే, చివర్లో, ఎవరైతే తండ్రి సేవలో తత్పరులై ఉంటారో, మళ్ళీ వారందరూ వచ్చి ఉంటారు. వారు చాలా అద్భుతమైన పాత్రను చూస్తారు. వైకుంఠం యొక్క వృక్షం సమీపంగా వస్తూ ఉంటుంది. కూర్చుని-కూర్చుని సాక్షాత్కారాలు చేసుకుంటూ ఉంటారు. మీరు పూర్తి ఫరిశ్తాలుగా ఇక్కడే అవుతారు. మనుష్యాత్మలు ఎవరైతే ఉన్నారో అందరూ శరీరాలను విడిచిపెడతారు. ఆత్మలు తిరిగి వెళ్ళిపోతాయి. బాబా పండాగా (మార్గదర్శకుడిగా) అయి అందరినీ తిరిగి తీసుకువెళ్తారు. ఈ జ్ఞానం కూడా ఇప్పుడే ఉంటుంది. సత్యయుగంలో జ్ఞానం పేరే ఉండదు. అక్కడ ప్రారబ్ధం ఉంటుంది, ఇప్పుడున్నది పురుషార్థము.

మీరు పురుషార్థం చేస్తారు, 21 జన్మలు తండ్రి నుండి స్వర్గ వారసత్వం తీసుకోవడానికి. మేము బ్రాహ్మణులము అని మీరు అర్థం చేయించవచ్చు. మిత్ర-సంబంధీకులు మొదలైనవారికి మీరు తండ్రి స్మృతిలో ఉంటూ భోజనాన్ని తయారుచేసి తినిపించినట్లయితే వారి హృదయం కూడా శుద్ధంగా అయిపోతుంది. చివర్లో ఎవరైతే మిగిలి ఉంటారో, వారు చాలా ఆనందాన్ని చూస్తారు. బాబా ఘడియ-ఘడియ తమ ఇల్లు మొదలైనవాటి అన్నింటినీ చూపిస్తూ ఉంటారు. ప్రారంభంలో మీరు చాలా చూసారు, మళ్ళీ అంతిమంలో చాలా చూస్తారు. ఎవరైతే వెళ్ళిపోతారో, వారేమీ చూడరు. ఈ వికారాలను పూర్తి రీతిలో త్యజించాలి, అప్పుడే వజ్ర-వైఢూర్యాలతో అలంకరింపబడతారు. త్యజించకపోతే అంతగా అలంకరింపబడరు కూడా. ఇప్పుడు మీరు జ్ఞాన రత్నాలతో అలంకరింపబడుతున్నారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సత్యమైన సంపాదనతో చేతులు నిండుగా చేసుకొని వెళ్ళాలి. ఒక్క తండ్రితో సత్యమైన వ్యాపారం చేసే సత్యమైన వ్యాపారస్థులుగా అవ్వాలి.

2. హృదయాన్ని శుద్ధంగా చేసుకోవడానికి తండ్రి స్మృతిలో ఉంటూ బ్రహ్మా భోజనాన్ని తయారుచేయాలి. యోగయుక్తమైన భోజనాన్ని తినాలి మరియు తినిపించాలి. వికారాలను విడిచిపెట్టి జ్ఞాన రత్నాలతో అలంకరించుకోవాలి మరియు ఇతరులను అలంకరించాలి.

వరదానము:- అన్ని చింతలను తండ్రికి ఇచ్చి చింతలేని స్థితిని అనుభవం చేసేవారిగా పరమాత్మ ప్రియులుగా కండి

ఎవరైతే పరమాత్మకు ప్రియమైన పిల్లలుగా ఉంటారో, వారు ఎల్లప్పుడూ హృదయ సింహాసనం పైన ఉంటారు. హృదయాభిరాముని హృదయం నుండి వారిని వేరు చేసేందుకు ఎవ్వరికీ ధైర్యం లేదు. అందుకే, మీరు ప్రపంచం ఎదురుగా నషాతో అంటారు, మేము పరమాత్మకు ప్రియమైనవారిగా అయిపోయాము. ఈ నషాలో ఉన్న కారణంగా అన్ని చింతల నుండి దూరమయ్యారు. మీరు ఎప్పుడూ

పొరపాటున కూడా అనలేరు, ఈ రోజు నా మనసు కొంచెం ఉదాసీనంగా ఉంది, నా మనసు లగ్నమవ్వడం లేదు... ఈ మాటలే వ్యర్థమైన మాటలు. నాది అని అనడము అనగా కష్టాలలో పడడము.

స్లోగన్:- ఏ విధమైన అలజడినైనా సమాప్తం చేసేందుకు సాధనము - డ్రామాపై స్థిరమైన నిశ్చయము.